

ప్రభుత్వ భూమి కబ్జా

- వాడచీపురుపల్లిలో 55 సెంట్లు ఆక్రమణకు యత్నం
- ఎక్స్‌కవేటర్‌తో చెట్లు కూల్చివేత
- స్థానికుల ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

పరవాడ మండలంలోని వాడచీపురుపల్లి (ఈస్టు) రెవెన్యూ పరిధి సర్వే నంబరు 205లో గల ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు.

- వార్త 8వ పేజీలో..

పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు

అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు

- ప్లాట్లుగా విభజించి అమ్మకం
- నాలా పన్ను ఎగవేత
- ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం
- పట్టించుకోని పలు శాఖల అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అనధికార లే-అవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకోకుండా, భూ మార్పిడి పన్ను (నాలా) చెల్లించకుండా దర్జాగా లేఅవుట్లు వేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీ నేతలు, ఇప్పుడు కూటమి నాయకులు.. రియల్టర్లతో అంటకాగుతూ అక్రమ లేఅవుట్లకు దన్నుగా నిలుస్తున్నారు. వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు రాకుండానే లేఅవుట్లు వేసి, ప్లాట్లుగా విక్రయిస్తున్నారు.

అనకాపల్లి మండల పరిధిలోని ఆవ ఖండం భూములు వాస్తవంగా ముంపు ప్రాంతం. భారీ వర్షాలు కురిస్తే నీరు నిలిచిపోయి సముద్రాన్ని తలపిస్తుంది. దీనిని చిత్తడి నేలల (వాటర్ బెల్ట్) ప్రాంతంగా గుర్తించడంవల్ల లేఅవుట్లకు, భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు. కానీ అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత ఆవఖండం భూములకు గిరాకీ పెరిగింది. గతంలో ఇక్కడ సెంటు రూ.4-5 లక్షలు పలికేది. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత క్రమేణా ధరలు పెరుగుతూ.. ప్రస్తుతం సెంటు రూ.10 లక్షలకు చేరింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను ఆవ ఖండం భూములపై పడింది. చిత్తడి నేలలు అయినప్పటికీ నిబంధనలు పట్టించుకోకుడా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు జాతీయ రహదారిని ఆనుకొని వున్న ఆవఖండం భూముల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీ లేఅవుట్ వేశారు. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో లేఅవుట్ అభివృద్ధి పనులను కొంతకాలం నిలిపివేశారు. తిరిగి కొద్ది రోజుల నుంచి లేఅవుట్‌లో రహదారుల ఏర్పాటు, భూమి చదును పనులు చేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ నుంచి తుది అనుమతులు రాకుండానే 'ప్రతిపాదిత వీఎంఆర్‌డీఏ' లేఅవుట్ అని ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి స్థలాలను విక్రయిస్తున్నారు.



అనకాపల్లి మండలం ఆవఖండం భూముల్లో అనధికార లేఅవుట్

ఇదిలావుండగా అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు జాతీయ రహదారి పక్కన, సమీపంలో యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి. నక్కపల్లిలో భారీ పరిశ్రమలు ఏర్పాటు కానుండడంతో రియల్టర్లు ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పెద్ద మొత్తంలో వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు. వీరికిలో కొంతమంది ఆయా ప్రభుత్వ శాఖలు, సంస్థల నుంచి అనుమతులు తీసుకోకుండా, లేఅవుట్లు వేస్తున్నారు.

యథేచ్ఛగా లేఅవుట్లు

వ్యవసాయ భూముల్లో ఇళ్ల స్థలాల లేఅవుట్ వేయాలంటే ముందుగా పలు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. గ్రామాలు అయితే సంబంధిత పంచాయతీ, పట్టణాలు అయితే మునిసిపాలిటీ, నగరాలు అయితే కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అక్కడ వున్న భూమి విలువకు అనుగుణంగా నాలా (నాన్-అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్) ప్రకారం పన్ను చెల్లించాలి. లేఅవుట్ వేయడానికి వీఎంఆర్‌డీఏతో పాటు స్థానిక సంస్థల అనుమతి కోసం దరఖాస్తు చేయాలి. ఆమోదం లభించిన తరువాత నిబంధనల ప్రకారం ఎకరాకు 10 సెంట్ల స్థలాన్ని సామాజిక అవసరాల కోసం వదిలిపెట్టాలి. లేఅవుట్ కనెక్టివిటీ రోడ్లు 40 అడుగులు, అంతర్గత రోడ్లు 33 అడుగుల వెడల్పుతో నిర్మించాలి. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించిన తరువాత సంబంధిత సంస్థల నుంచి తుది ఆమోదం పొందాలి. ఆ తరువాతే లేఅవుట్‌లో స్థలాలను విక్రయించాలి. కానీ అత్యధిక శాతం రియల్టర్లు ఈ నిబంధనలు పాటించకుండా అక్రమంగాతా లేఅవుట్‌లు

... మిగతా 8వ పేజీలో



మునగపాక మండలంలో అనధికార లేఅవుట్

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

మారని ఫార్మా కంపెనీల తీరు

మళ్లీ అదే నిర్లక్ష్యం

- లూపిన్‌లో విష వాయువులు లీక్
- ఆరుగురికి అస్వస్థత
- సాధారణ మాస్కులతో కార్మికులు
- వాస్తవాలు దాస్తున్న కంపెనీ యాజమాన్యం
- సహకరిస్తున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడ రాంకీ ఫార్మాసిటీలో మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. గత జూన్ నెలలో సాయి శ్రేయాస్‌లో విషవాయువు వెలువడి ఇద్దరు చనిపోయారు. సరైన మాస్కులు లేని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారణ అయింది. ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే వారికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లు ఇవ్వాలని ఆరోజే అధికారులు ఆదేశించారు. కానీ దానిని పాటించకపోవడం వల్ల సోమవారం ఆరుగురు కార్మికులు ఆస్పత్రి పాలయ్యారు. ఈసారి లూపిన్ ఫార్మా కంపెనీలో విష వాయువు లీకైంది.

ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు జరిగితే యాజమాన్యం ఉదయం 11 గంటలకు ఫ్యాక్టరీస్ అధికారులకు తెలియజేసింది. ప్రతి ఫార్మా కంపెనీ ఇలాగే చేస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆస్పత్రికి పంపి, అక్కడి సాక్ష్యాలన్నీ మార్చేస్తున్నారు. ఏ వాయువు లీకైందో, ఏమి జరిగిందో అధికారులు వచ్చి తెలుసుకునే అవకాశం లేకుండా చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలని ఐటీటీతో అనుసంధానం చేసిన సెన్సార్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వాటిని స్థానిక తహశీల్దార్, అగ్నిమాపక దళం, జిల్లా యంత్రాంగానికి అనుసంధానం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య కంపెనీలన్నింటికీ ఆదేశించారు. ఆ సెన్సార్లు ఎక్కడైనా ప్రమాదం జరిగితే అలారం మోగిస్తాయి. వాటితో అంతా అప్రమత్తమై వెంటనే అక్కడకు వెళతారనేది ఆలోచన. కానీ దీనిని ఎవరూ అమలు చేయడం లేదు. సెన్సార్లు లేవు, సైరన్లు లేవు. ప్రమాదం జరిగిన ఎనిమిది గంటల తరువాత సమాచారం ఇచ్చారు. దాంతో 12 గంటలకు అధికారులకు వెళ్లారు. అప్పటికే ఆ వాయువు అంతా గాలిలో కలిసిపోయింది. ఏమి లీకైందో నిర్ధారించలేమని అధికారులు చేతులెత్తేశారు. ఈ తప్పు చేసినందుకు యాజమాన్యంపై ప్రత్యేకంగా కేసు పెట్టాల్సి ఉంది.





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉత్పత్తి పేరు చెప్పడం లేదు

ప్రమాదం జరిగిన స్థలానికి అధికారులు వెళ్లారు. ఒక 'ఉత్పత్తి' ప్రక్రియ పూర్తయిన తరువాత వచ్చిన వ్యర్థాలను ఫిల్టరేషన్ యూనిట్‌కు పంపుతున్నప్పుడు ఆ పైపులైన్‌లో ఎక్కడో లీకేజీ వల్ల గుర్తు తెలియని విషవాయువు వచ్చిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. అక్కడ సాధారణ మాస్క్‌తో డ్యూటీలో ఉన్న ఉద్యోగి వాంతులు చేసుకున్నారు. బీపీ డౌన్ అయింది. వెంటనే కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారంటూ వారినీ తరలించారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు.

ఏ మందు తయారు చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందో వెల్లడించకుండా సమాచారం దాస్తున్నారు. అందులో ఐసోబ్యుటైల్ నైట్రేట్, మిథైల్ ఎమనైన్‌తో పాటు మరో రసాయనం ఉందని చెబుతున్నారు. దాని పేరు ఏమిటో వెల్లడించడం లేదు. ఉత్పత్తి, అందులో రసాయనాలు చెబితే..ఏ వాయువు

... మిగతా 8వ పేజీలో

గాంధీగ్రామంలో మృత్యుపాశాలు

- నివాసాల పైనుంచే హెచ్‌టీ లైన్లు
- విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి
- గతంలో ఇద్దరు మృత్యువాత, మరొకరికి అంగవైకల్యం
- హెచ్‌టీ లైన్లు మార్చాలని సర్పంచ్‌తోసహా గ్రామస్థుల వినతి
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

చోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని గాంధీగ్రామం పంచాయతీ సిటిజన్ కాలనీలో విద్యుత్ తీగలు స్థానికుల పాలిట యమపాశాలుగా మారాయి. ఆదివారం రాత్రి కాలనీకి చెందిన దూది రాము అనే తాపీ మేస్త్రీ తన ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో స్థానికులు మరోసారి తీవ్ర భయాందోళన చెందారు. రాము ఇంటికి ఆనుకుని వెళుతున్న హెచ్‌టీ లైన్ నుంచి అతని ఇంట్లోకి విద్యుత్ ప్రసరించడంతో స్నానానికి సిద్ధమైన రాము షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాలనీలో నివాసాలపై నుంచి హెచ్‌టీ లైన్ వెళుతుండడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ తీగల కారణంగా గతంలో ఇద్దరు మృతిచెందగా, మరో వ్యక్తి చేతివేళ్లు తెగిపోయాయి. అప్పట్లోనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇళ్ల పైనుంచి హెచ్‌టీ లైన్ వెళుతుండడంతో మేడపైకి వెళ్లడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది. కాలనీలో ఇళ్ల పైనుంచి వెళుతున్న విద్యుత్ వైర్లు తొలగించాలంటూ సర్పంచ్ గాడి అప్పారావు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. మండల పరిషత్ సమావేశంలో పలుమార్లు కోరినా ఫలితం లేకపోయింది. హెచ్‌టీ లైన్‌ను మార్చేందుకు గతంలో ప్రతిపాదనలు రూపొందించినా, తరువాత దానిని పక్కనపెట్టేశారు. మరికొంతమంది ప్రాణాలు పోతే తప్ప విద్యుత్ శాఖ అధికారులు స్పందించారా? అని స్థానికులు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు.





గాంధీగ్రామం సిటిజన్ కాలనీలో ఇళ్ల పైనుంచి వెళుతున్న హెచ్‌టీ విద్యుత్ తీగలు

కలెక్టరేట్ ఎదుట మూగ మహిళ ఆత్మహత్యాయత్నం

తనతోపాటు ఇద్దరు బిడ్డలపై పెట్రోల్ పోసుకొని అఘాయిత్యం

- అడ్డుకున్న పోలీసులు.. కలెక్టర్, ఎస్పీ దృష్టికి సమస్య
- కౌన్సెలింగ్ చేసిన విజయకృష్ణన్
- కొన్నేళ్ల నుంచి భర్త వేధిస్తున్నాడని ఆవేదన
- ఫిర్యాదు చేసినా.. మునగపాక ఎస్‌ఐ పట్టించుకోలేదని ఆరోపణ
- మీడియాకు వెల్లడించిన కుమార్తె



పెట్రోల్ సీసాను స్వాధీనం చేసుకున్న పోలీసులు. చిత్రంలో బాధితురాలు సంతోషమ్మ, కుమారుడు సంజీవ్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

కలెక్టరేట్ ఎదుట సోమవారం బధిరురాలైన (మూగ) ఓ మహిళ తనతోపాటు ఇద్దరు పిల్లలపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే వున్న అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవికుమార్ అడ్డుకొన్నారు. ఆమె సమస్యను కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ స్పందించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి బాధితురాలి కుమార్తె పల్లవి తెలిపిన వివరాలిలా వున్నాయి.

మునగపాక మండలం తోటాడ సిరసపల్లి గ్రామానికి చెందిన యాండ్ర సంతోషమ్మకు పుట్టుకతోనే బధిరురాలు. కొన్నేళ్ల క్రితం దుర్గాప్రసాద్ అనే లారీ డ్రైవర్ ఈమెను వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరికి కుమారుడు, కుమార్తె కలిగారు. ప్రస్తుతం కుమారుడు సంజీవ్ పదో తరగతి, కుమార్తె పల్లవి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. కాగా దుర్గాప్రసాద్ కొద్ది రోజుల నుంచి భార్యతో గొడవపడుతూ ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. గత నెల పదో తేదీన డ్రైవర్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన దుర్గాప్రసాద్.. భార్యతోపాటు పిల్లలను కూడా కొట్టాడు. వేధింపులు భరించలేక ఆమె మునగపాక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్తపై ఫిర్యాదు చేసింది. భార్యను, పిల్లలను కొట్టి, చిత్ర హింసలకు గురిచేయాలంటూ అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్గాప్రసాద్‌ను

... మిగతా 8వ పేజీలో

జడ్పీ చైర్‌పర్సన్‌పై చల్లారని అసమ్మతి

రెండుగా చీలిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు

- నేడు దేవరాపల్లిలో జడ్పీటీసీ ఫోరం అధ్యక్షుడి విందు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం గురించి చర్చ
- పార్టీ పెద్దలకు సమాచారం



సుభద్ర, జడ్పీ చైర్‌పర్సన్ (ఫైల్)

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రపై సొంత పార్టీలో మొదలైన అసంతృప్తి చల్లారినట్టు లేదు. ఆమెకు మద్దతుగా ఒక వర్గం, వ్యతిరేకంగా మరో వర్గం తయారైనట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో అవిశ్వాసం పెట్టాలనే ప్రతిపాదన మరోమారు తెరపైకి వచ్చినట్టు తెలిసింది.

వచ్చే నెల 23వ తేదీ నాటికి జడ్పీ చైర్‌పర్సన్‌గా సుభద్ర ఎన్నికై నాలుగు సంవత్సరాలు పూర్తి కానున్నది. నాలుగేళ్లు పూర్తయినట్టయితే అవిశ్వాసం పెట్టేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో సుభద్రపై అవిశ్వాస తీర్మానం కోసం నెల రోజుల నుంచి సొంత పార్టీకి చెందిన కొందరు సభ్యులు పావులు కదుపుతున్నారు. ఇది సభ్యుల మధ్య విభేదాలకు దారితీసి, ఫోరం అధ్యక్షుడిని మార్చేంత వరకూ వెళ్లింది. జడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ పైలా సన్యాసిరాజును కూడా మార్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదిలావుండగా జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన కర్రి సత్యం (దేవరాపల్లి) సొంతూరు మామిడిపల్లిలో మంగళవారం ఆత్మీయ కలయిక పేరిట విందు సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామ దేవత పండుగను పురస్కరించుకుని విందు

... మిగతా 8వ పేజీలో

అధిక లోడు లారీలతో రహదారికి ముప్పు

- పయనీర్ కంపెనీకి వచ్చే భారీ వాహనాలతో దెబ్బతిన్న తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డు
- నర్సీపట్నం ఆర్డీవో రమణ వెల్లడి
- నివారణ చర్యలపై పలు శాఖల అధికారులతో సమావేశం

నర్సీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

మాకవరపాలెం మండలంలోని పయనీర్ కంపెనీకి అధిక లోడుతో వస్తున్న భారీ వాహనాల కారణంగా కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి మాకవరపాలెం మండలం రామన్నపాలెం జంక్షన్ వరకు 14 కిలోమీటర్ల మేర రహదారి దెబ్బతింటున్నట్టు ఆర్‌అండ్‌బీ అధికారులు గుర్తించారని నర్సీపట్నం ఆర్డీవో వీవీరమణ తెలిపారు. అధిక లోడుతో నడుస్తున్న లారీల కారణంగా రహదారితోపాటు తాళ్లపాలెం సమీపంలోని వంతెనకు వాటిల్లుతున్న నష్టం, నివారణ చర్యలపై సోమవారం ఆర్‌అండ్‌బీ, పోలీస్, రవాణా, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతోమాట్లాడుతూ, తాళ్లపాలెం వద్ద వంతెన పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారులు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వంతెన సామర్థ్యానికి మించి అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల దెబ్బతింటున్నదని అన్నారు. ఇప్పుడున్న వంతెనను పటిష్ఠం చేయడమా? లేకపోతే కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపడమా? అన్నదానిపై ఆర్‌అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. అధిక లోడుతో వచ్చే వాహనాలను కట్టడి చేయడానికి మాకవరపాలెం మండలం శెట్టిపాలెం సమీపంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈ విద్యాసాగర్, లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ, కశింకోట, మాకవరపాలెం ఎస్‌ఐలు లక్ష్మణరావు, దామోదరరావు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆర్డీవో వీవీ రమణ

ఉపాధిలో అక్రమాలకు చెక్

- అందుబాటులోకి కొత్తగా 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం' యాప్
- పనిచేసేచోట ఉదయం, సాయంత్రం కూలీల గ్రూప్ ఫొటోలు తీయాలి
- వీటిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- ఫొటోల్లో ఉంటేనే.. పనులకు హాజరైనట్టు నిర్ధారణ
- అక్రమ చెల్లింపులకు అడ్డుకట్ట

కోటవురట్ల ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల మస్టర్ నమోదు చేయడంతోపాటు ఆయా కూలీల గ్రూప్ ఫొటోను ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దీనివల్ల ఉపాధి పనులకు రాకుండా, సిబ్బంది అండతో కూలి డబ్బులు పొందే వారి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.



సుంకపూర్‌లో పూడిత తీత పనులు చేస్తున్న కూలీలు

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు వేరే ప్రాంతాలకు వలసపోతుంటారు. ఇటువంటి పరిస్థితిని నివారించడానికి సుమారు రెండు దశాబ్దాల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే గ్రామాల్లో రాజకీయ ఆధిపత్యం చెలాయించే కొంతమంది వ్యక్తులు, ఉపాధి హామీ పథకం పనులను

... మిగతా 8వ పేజీలో

శిథిలావస్థకు చేరిన నీటి పథకాలు


కొండకర్ల ఎస్సీ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకు

- పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ట్యాంకులు
- ట్యాంకులపై చిన్నారుల ఆటలు
- భయపడుతున్న దోసూరు, కొండకర్ల వాసులు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాదపు అంచుల్లో రక్షిత నీటి పథకాల ట్యాంకులు దర్శనమిస్తున్నాయి. మండలంలోని దోసూరు ఎస్సీ కాలనీ, కొండకర్ల ఎస్సీ కాలనీల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన నీటి పథకాల ట్యాంకులు ప్రస్తుతం తాగునీటికి ఉపయోగపడడం లేదు.

దోసూరు కాలనీ మధ్యలో ఉన్న ట్యాంకు కమ్యూనిటీ హాలు పక్కనే ఉంది. ప్రతి రోజూ సాయంత్రం ఇక్కడే ప్రజలంతా చేరి కాలయాపన చేస్తూ ఉంటారు. ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. కూలిపోడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి వాటర్ ట్యాంకులను తొలగించి, కొత్త ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ గ్రామంలో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసుకొని కేన్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. పలుమార్లు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. కొండకర్ల కాలనీలోని నీటి పథకం నీటిని వాడుకోవడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. కొండకర్ల ట్యాంకుపైన చిన్నపిల్లలు ఆడుకోవడం, ట్యాంకు కింద ఒక కుటుంబం ఆశ్రయం పొందుతున్నది. ఏ రోజైనా ప్రమాదం జరిగితే వారి ప్రాణాలకు బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో నీటి పథకాల శ్లాబు, బీములు, పిల్లర్లు, మెట్లు పాడైపోయి ఇనుము పైకి కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే నీటి ట్యాంకులను పడగొట్టి కొత్తవాటిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


దోసూరు ఎస్సీ కాలనీలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న రక్షిత నీటి పథకం ట్యాంకు

తాండవ కార్మికుల జీతాలు విడుదల చేయాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

పాయకరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాండవ షుగర్స్ కార్మికులకు జీతాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం విశాఖ నుంచి రాజమహేంద్రవరం వెళుతూ పాయకరావుపేటలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ ఆధ్వర్యంలో పలువురు తాండవ షుగర్స్ కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ తాండవ షుగర్స్‌లో పనిచేసిన కార్మిలకు 2019 నుంచి రూ.12 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. చేసిన పనికే వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జేడీ లక్ష్మీనారాయణను తోట నగేశ్, గొర్రెల రాజబాబు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాసరావు, కంభంపాటి వెంకటరమణ, ఇంజరపు సూరిబాబు, భజంత్రీల శివ, తాండవ షుగర్స్ కార్మికులు కర్రి శ్రీను, వెంకటేశ్వరరావు, పక్కుర్తి కొండబాబు పాల్గొన్నారు.


సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను సత్కరించిన నాయకులు

కొరుప్రోలు పీఏసీఎస్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

ఎస్.రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు పీఏసీఎస్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును సోమవారం రాత్రి సొసైటీ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, కార్యదర్శి వరప్రసాద్ మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ ఆంజనేయులు చేతులు మీదుగా విజయవాడలో అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రామకృష్ణ మాట్లాడుతూ 2024-25 గాను పీఏసీఎస్ ద్వారా రైతులకు రూ. 12.75 కోట్ల రుణాలు మంజూరు చేయడంతో పాటు చక్కని సేవలందించినందుకు ఈ అవార్డుకు ఎంపికైందన్నారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని రామకృష్ణ తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ ఆంజనేయులు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చైర్‌పర్సన్ రామకృష్ణ, కార్యదర్శి వరప్రసాద్

ఉప్పుగల్లీలు ఏపీఐఐసీకి బదలాయించొద్దు

- పూడిమడక పంచాయతీ తీర్మానం


పంచాయతీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అచ్యుతాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తీరంలో ఉప్పు గల్లీలలను ఏపీఐఐసీకి బదలాయించ వద్దని పూడిమడక పంచాయతీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం సర్పంచ్ చేపల సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. 2015 నుంచి పూడిమడకలో 166.15 ఉప్పు గల్లీలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని మత్స్యకారులతో పాటు పేదలకు లీజుకి ఇమ్మని చాలా కాలంగా పోరాడుతున్నా అధికారులు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించాలని నిర్ణయించారని, దీనిని విరమించుకోవాలని తీర్మానించారు. అలాగే సముద్రం వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతయితే మరణ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు సకాలంలో జారీ చేయాలని తీర్మానించారు. సమావేశంలో పొన్నమల్ల కొండబాబు, పిరాది దానమ్మ, మేరుగ అప్పలరాజు, వాడమదుల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి సహకారం

- నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి

నక్కపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పీఏసీఎస్ పరిధిలో రైతులకు అవసరమైన పంట రుణాలిచ్చి, వారికి పూర్తిగా సహకరిస్తామని పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. సోమవారం సొసైటీ చైర్‌పర్సన్‌గా బుజ్జి, డైరెక్టర్లుగా కోసూరి శ్రీను, మనబాల కొండబాబు నక్కపల్లి సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఐదుగురు రైతులకు రూ.20 లక్షల పంట రుణాల చెక్కులను కొప్పిశెట్టి బుజ్జి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం మంత్రి అనిత సహకారంతో నక్కపల్లి సొసైటీని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో రైతులు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పంట రుణాల రికవరీ అంశంలో కూడా సంయమనం పాటిస్తామన్నారు. చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, డైరెక్టర్లను నియోజకవర్గ కూటమి నాయకులు తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీను, గొర్లె రాజబాబు, గోసల శ్రీకాంత్, జగదీశ్వరరావు అభినందించారు.


సొసైటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడుతున్న కొప్పిశెట్టి బుజ్జి, డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు

పెనుగొల్లు సొసైటీ చైర్‌పర్సన్ పవన్‌కుమార్ బాధ్యతల స్వీకారం


చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఎస్.రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్డి పవన్‌కుమార్, డైరెక్టర్లు చల్లపల్లి తాతబ్బాయి, దోసపాత్రుని నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన హోం మంత్రి వంగలపూడి అనిత, జనసేన, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్, ఇద్దరి డైరెక్టర్లను టీడీపీ నాయకులు పల్లెల జగ్గారావు, ప్రగడ తులసి తదితరులు సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన

ఎలమంచిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సీడీపీవో కార్యాలయం వద్ద సోమవారం పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీ సిబ్బందికి విధి నిర్వహణ కోసం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదని, తిరిగి వాటిని తీసుకోవాలంటూ నిరసన చేపట్టారు. ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్స్ కార్యాలయం వద్ద నినాదాలు చేసి పనిచేయని సెల్‌ఫోన్‌లతో సమయం వృథా అని నినాదాలు చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


పనిచేయని సెల్‌ఫోన్‌లు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం సుభిక్షం : టీడీపీ

ఎలమంచిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కొఠారు సాంబ అన్నారు. సోమవారం మునిసిపాలిటీ ధర్మవరంతోపాటు క్లస్టర్-2 లో స్థానిక నేతలతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింట తిరిగి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలుపుతున్న ఘనత తమదేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల అంకుటిత దీక్షతో పాలన సాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు కరణం రవికుమార్, బొద్దపు శ్రీను, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్మవరం వార్డులో ఇంటింట తిరిగి ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నేతలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జి.అప్పన్న

పాయకరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని పట్టణ సీఐ జి.అప్పన్న తెలిపారు. సోమవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో డ్రైవర్లు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వలన రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దేవమ్మ, రెడ్డి, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేష్ఠం

కోటవురట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):తల్లి పాలు బిడ్డలకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హైమవతి, సుజాత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వారిలో రోగనిరోధికశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం కోటవురట్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు.

రాంబిల్లిలో..

తల్లిపాలు బిడ్డకు అమృతమని రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పీహెచ్‌సీలో తల్లి, బిడ్డకు పాలిచ్చే గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు పాలు ఇవ్వడం వలన రోగనిరోధక శక్తి వస్తుందన్నారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌వీఎస్ రాణి, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

సునీతకు సంఘీభావం తెలిపిన ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ కార్యకర్త నియామకం అక్రమంగా జరిగిందని గ్రామానికి చెందిన మంతిని సునీత చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సోమవారం వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతానన్నారు. రాజకీయ కారణాలతో అర్హురాలైన సునీతకు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఇవ్వకుండా అర్హతలేని వ్యక్తికి ఇచ్చారన్నారు. సునీతకు న్యాయం చేయాలని, వక్రమార్గంలో ఉద్యోగం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ధర్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు లాలం రాము, నర్మాల కుమార్, కోనబుజ్జి, దేశంశెట్టి శంకరరావు, భీముని వెంకటేశ్వరరావు, జగన్, గంగూలీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న సునీత నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ధర్మశ్రీ

బోధనోపకరణాల తరగతి గదులపై అవగాహన

నక్కపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించాలంటే బోధనోపకరణాల తరగతి గదులను సద్వినియోగపర్చుకోవాలని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు యేడిద వెంకట రమణ చెప్పారు. సోమవారం బోధనోపకరణాల తరగతి గదుల్లో విద్యా బోధనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక బోధన వల్ల అన్ని పాఠ్యాంశాలపై విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుందని, దీని వల్ల పరీక్షల్లో ఏ ప్రశ్నలు వచ్చినా సునాయాసంగా జవాబు రాయగలిగే స్థాయిలో వుంటారని చెప్పారు. గ్రూప్ వర్క్, గ్రూప్ డిస్కషన్స్ గురించి తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను వెంకట రమణ నివృత్తి చేశారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎస్.రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ, కొరుప్రోలు, లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం, వాతాడ, పెదఉప్పలం, చినఉప్పలం, రేవుపోలవరం, గుర్రాజుపేట, కోనవానిపాలెంతో పాటు కొరుప్రోలు కాయిర్ పరిశ్రమలు, చినఉప్పలం ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంట వరకు కోనవానిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాలతో పాటు నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎల్‌వీ1 బ్రేకర్ నిర్మాణ పనులతో పాటు ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మహిళల భద్రతపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

అచ్యుతాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం బ్రాండిక్స్‌లో మహిళల భద్రతా అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు పనిచేస్తున్న కర్మాగారాల్లో భద్రతతో పాటు రక్షణ ప్రమాణాలు అవసరమన్నారు. అత్యవసర, ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు శక్తి యాప్, లేక 112 నంబరుకి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్, మహిళా పోలీస్ ఎస్ఐ రాములమ్మ, కర్మాగారం హెడ్ టి. రాజేష్, హెచ్‌ఆర్ఎం హేమంత్, మేనేజర్ శ్యామల, వసుధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల కప్ ఆవిష్కరణ


గాజువాకలో కబడ్డీ పోటీల కప్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

మునగపాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీల కప్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారని టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాకలోని పల్లా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం కప్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, పొలమరశెట్టి మురళి, ఆడారి గణేష్, యోగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెళ్లయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వండి

- నిర్వాసిత కుటుంబాల మహిళల డిమాండ్

నక్కపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కారిడార్ కోసం భూములు, ఇళ్లు ఇచ్చిన కుటుంబాల్లో వివాహమైన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వాసిత కుటుంబాల మహిళలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. 2016లో కారిడార్ కోసం సేకరించే భూములకు సంబంధించి అవార్డు ప్రకటించారని, వివాహమైన ఆడపిల్లలకు ఆర్ఆర్ ప్యాకేజీ, 5 సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలు తహశీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లు ఆపాలి

మునగపాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నీటి తీరువా చెల్లించాలంటు రెవెన్యూ అధికారులు చేపట్టిన నోటీసులు జారీ ఆపాలని ఏపీ రైతు సంఘం నాయకుడు ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక సహకార సంఘం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరు లేక ఆకుమడులు వేసుకోలేని పరిస్థితుల్లో రైతులుంటే పన్ను చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు అందజేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో రైతులు దాడి భాస్కరరావు, బీశెట్టి సన్యాసినాయుడు, పొలిమేర రాము, వేగి సూరిబాబు, దాడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణంపాలెం నిర్వాసితుల డిమాండ్లు నెరవేర్చాలి'

రాంబిల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్‌కు భూములిచ్చి నిర్వాసితులైన కృష్ణంపాలెం గ్రామస్థుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ ఎస్ఈజడ్‌కు భూములిచ్చి 18 సంవత్సరాలు అవుతున్నా నిర్వాసిత కుటుంబాలకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, కనీసం వీరికి ఉపాధి కూడా కల్పించలేదన్నారు. కృష్ణంపాలెం గ్రామస్థులకు పంచదార్లలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటిని నిర్మించేందుకు రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంపాలెం సర్పంచ్ పైల సత్తిబాబు, నిర్వాసితులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కొక్కిరాపల్లి హైవే జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు


సిమెంటు దిమ్మల ఏర్పాటును పరిశీలిస్తున్న పోలీసులు, హైవే అథారిటీ ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి వద్ద కొక్కిరాపల్లి హైవే జంక్షన్ వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, హైవే అథారిటీ ప్రతినిధుల సమక్షంలో సిమెంట్ దిమ్మలను సోమవారం ఏర్పాటు చేశారు. హైవే జంక్షన్ నుంచి సర్వీసు రోడ్డుకు ప్రయాణించే సమయంలో వాహనదారులు క్రమపద్ధతిలో ప్రయాణించేలా చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సిమెంట్ దిమ్మలను రహదారికి రెండు వైపులా ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు వీటిని ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలంటూ నిరసన

ఎస్.రాయవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బల్క్ డ్రగ్ పార్కుపై ఈనెల 6న నక్కపల్లిలో నిర్వహించబోయే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలంటూ గుర్రాజుపేటలో సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ గుర్రాజుపేటలోని భూములను రైతులెవ్వరూ ఇవ్వకపోయినా బల్క్‌డ్రగ్ పార్కు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు ఎం రాజేష్, దాట్ల రామరాజు, వెంకటపతిరాజు, మహదేవ్, గోవింద్, రమణ, అప్పలరాజు, మంగ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోంది'


సమావేశంలో మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కూటమి ప్రభుత్వం లేనిపోని మాటలతో ప్రజలను మభ్యపెట్టి, మేనిఫెస్టోను అమలుచేసినట్టు ప్రచారం చేసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. సోమవారం నక్కపల్లిలో జరిగిన వైసీపీ మండల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోను నూరుశాతం అమలుచేసిన ఘనత తమ నేత జగన్‌కు దక్కుతుందన్నారు. 50 ఏళ్లు నిండిన వెనుకబడిన తరగతుల వారందరికీ పెన్షన్లు ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకూ ఆ ప్రస్తావనే లేదన్నారు. మహిళలకు ఆర్థిక సాయం ఏమైందని ప్రశ్నించారు. విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైసీపీ నాయకులు మణిరాజు, పాపారావు, సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, పొడగట్ల వెంకటేశ్, గొర్ల గోవింద్, లొడగల చంద్రరావు, కొల్లాటి బుజ్జి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఇబ్బందులు తలెత్తరాదు

- వినాయక విగ్రహ ఏర్పాటు నిర్వాహకులకు ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్పీ శ్రావణి సూచన
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్టీఆర్ స్టేడియం పరిశీలన



స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయిషా, డీఎస్పీ శ్రావణి తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వినాయక విగ్రహ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్పీ ఎం.శ్రావణిలు నిర్వాహకులకు స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా వినాయక విగ్రహ ఏర్పాట్లపై వివాదం రేగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరు సోమవారం సాయంత్రం స్టేడియాన్ని, వినాయక విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోతవం నాడు వివిధ శాఖల శకటాలు తిరగడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్మాణం చేసిన రెండు వరుసల పందిరిని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. అంతేకాకుండా ఆరోజున శకటాలు ఏ విధంగా తిరుగుతాయో, ఇబ్బందులు ఉంటాయో లేవో తెలుసుకునేలా ఒక వాటర్ ట్యాంకర్ ద్వారా రిహార్సల్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలు సరుగుడు కర్రల పందిరిపై ఎక్కకుండా నిర్వాహకులే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వలంటీర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల చుటూ బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎంబీ అప్పారావు, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ విజయ్‌కుమార్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆయకట్టు శివారు భూములకూ నీరు : కొణతాల



సీతానగరం ఛానల్ వద్ద రైతులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని సీతానగరం, తుమ్మపాల తదితర గ్రోయిన్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నీటిపారుదల రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. దీంతో ఇప్పుడు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఆయకట్టు పరిధిలోని చివరి రైతు వరకూ సాగునీటిని అందించాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. దశల వారీగా నిధులను తీసుకువచ్చి మొత్తం నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆనకట్టలు, గ్రోయిన్లు పంట కాలువలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు పూసపాటి భరత్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, టీడీపీ మండల నాయకుడు పోలిన సూరిజగ్గారావు, బాబ్జీ, సురేష్, నాయుడు తదితరులు ఉన్నారు.

14న కోట్ని వీధిలో మరిడిమాంబ ఉత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాగజగదీశ్వరరావు తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోట్ని వీధిలో ఈ నెల 14న మరిడిమాంబ ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు సోవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. దేవస్థానం కమిటీ ఛైర్మన్ కర్రి హరి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి కోట్ని రామకృష్ణ, తలారి ప్రసాద్, కోట్ని రాంబాబు, ఇల్లపు శ్రీను, ఇల్లపు పరమేష్, వేగి వెంకటరావు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో అందిన అర్జీల తక్షణ పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా జడ్సీ కె.చక్రవర్తి ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి సోమవారం పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలపై అర్జీలను సమర్పించారు. బాలాజీరావుపేటకు ఆనుకొని ఉన్న ముస్లిం శ్మశానవాటిక వద్ద కూరగాయల వ్యర్థాలు నిల్వ ఉంచుతుండడం వల్ల శ్మశానవాటిక గోడ దెబ్బతింటుందని, ఇలా మున్ముందు వేయకుండా చర్యలు తీసుకోవాలని జామియా మసీదు అధ్యక్షుడు పీఎస్ఎన్ హుస్సేన్ కోరారు. అలాగే ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల తన సిబ్బంది ద్వారా అర్జీని పంపారు. భూసమస్యలు కూడా జడ్సీ దృష్టికి పలువురు తీసుకు వచ్చారు. ఈ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'ప్రజా, దళిత బహుజన సంఘాలు బలపడాలి'



యగ్గాడ నాగేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘాల ప్రతినిధులు

కొత్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల హక్కుల సాధనకు పోరాడిన నాయకుడు యగ్గాడ నాగేశ్వరరావు అని ప్రముఖ న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. వేట జంగాలపాలెంలో సోమవారం నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజా సంఘాలు, దళిత బహుజన సంఘాలు బలపడాలని సూచించారు. గిరిజన సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకుడు పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడు యగ్గాడ నాగేశ్వరరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సమన్వయ కమిటీ నాయకులు, న్యాయవాదులు, మాజీ సర్పంచ్‌లు, దళిత బహుజన ఆదరణ సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ వేయాలి

- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం
- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆమె జిల్లా అధికారులతో కలిసి మండలాభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో శతశాతం వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. చెత్తకుప్పలు నిల్వలేకుండా ఏ రోజుకు ఆ రోజు తొలగించేలా చర్యలు చేపట్టాలని వివరించారు. అలాగే, గ్రామాల్లో మురుగు కాలువలను, రోడ్లను శుభ్రపరచాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు విజృంభించినా, అంటు వ్యాధులు సోకినా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డ్వామా పీడీ పి.పూర్ణిమాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్‌లు అప్పగింత
- 5జీ నెట్‌వర్కుతో ట్యాబ్‌లు సరఫరా చేయాలని డిమాండ్



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట పాతసెల్‌ఫోన్లతో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు 5జీతో కూడిన ట్యాబ్‌లు సరఫరా చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం వారంతా కొత్తూరు పంచాయతీలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పాత ఫోన్లతో ఆందోళన చేపట్టి వాటితో పాటు సిమ్‌లను కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు గత వైసీపీ ప్రభుత్వం సెల్‌ఫోన్లు అందజేసి ఐదు సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. 2జీబీ ర్యామ్, 4జీ నెట్‌వర్కు కలిగిన ఈ ఫోన్ల వల్ల తమ విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు ఇస్తామని చెప్పినా నేటికీ ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కావడం లేదని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని మంత్రివర్గం తీర్మానం చేసినా నేటికీ జీవో అమలు కాలేదని పేర్కొన్నారు. ఐదేళ్లు కావస్తున్నా వేతనాల పెంపు జరగలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 5జీ నెట్‌వర్కు ఉన్న ట్యాబ్‌లు ఇవ్వాలని అప్పటి వరకు ఆన్‌లైన్ వర్కులు చేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, బుజ్జి, గౌరవాధ్యక్షురాలు కాసులమ్మ, తనూజ, గంగావేణి, భవానీ, ఆదిలక్ష్మి, పుష్ప, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కోసం ఆటో కార్మికుల ధర్నా



ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వాహనమిత్ర పథకం ద్వారా రూ. 15వేలు ఇవ్వాలని, ప్రమాదాల నియంత్రణ పేరుతో తీసుకువచ్చిన నూతన మోటార్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వేధింపులు కూడా ఆటోరంగం కార్మికులపై తీవ్రంగా ఉందన్నారు. వీటన్నింటిపై ప్రత్యేక దృష్టిసారించి సదరు కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.రాజు, సన్నిబాబు, దొండా అప్పారావు, జె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న కార్మికుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

'లూపిన్'లో అస్వస్థతకు గురైన వారికి పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలో గల లూపిన్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామన విషవాయువులు లీకైన ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురై షీలానగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు రాత్రి పరామర్శించారు. అస్వస్థతకు గురైన ఆరుగుర్ని కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఘటన వివరాలపై ఆరా తీశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీరికి మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. ఇదిలావుంటే, లుపిన్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి యాజమాన్యంపై చర్యలు తీసు కోవాలని పేర్కొన్నారు.

పట్టణంలో జోనల్ కమిషనర్ విస్తృత పర్యటన

- కోట్నివీధిలో ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత తనిఖీ
- భీమునిగుమ్మంలో మంచినీటి నాణ్యత పరిశీలన



భీమునిగుమ్మంలో మంచినీటి నాణ్యతను పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సోమవారం విస్తృతంగా పర్యటించారు. కోట్నివీధిలోని ప్రజా మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే రింగు రోడ్డులోని కాలువపై అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. భీమునిగుమ్మంలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలతో మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్‌లను పరిశీలించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకుడు వెంకటేష్‌కు సూచించారు. రోజువారీ భోజనాల వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు.

వై.జంక్షన్.. నిత్యం జనానికి టెన్షన్

- ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు
- హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మండల పరిషత్ కార్యాలయం వద్ద గల వై.జంక్షన్

పరవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ పరిషత్ కార్యాలయ సమీపంలో గల వై.జంక్షన్ ప్రయాణికుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే జంక్షన్‌ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పరవాడ నుంచి గాజువాక వైపు వెళ్లే వాహనాలు ఈ జంక్షన్ వద్దకు వచ్చే సరికి నేరుగా లంకెలపాలెం వైపు తిరుగుతాయో.. లేకుంటే గాజువాక వైపు వెళ్తాయో.. అర్థం కాని పరిస్థితి నెలకొంటోంది. అదే విధంగా గాజువాక నుంచి వచ్చే వాహనాలు లంకెలపాలెం వైపు వెళ్తాయో.. లేక పరవాడ ఊరులోకి వస్తాయో అన్న తికమక, గందరగోళం కలుగుతుంది. జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు లంకెలపాలెం నుంచి భారీ వాహనాలు అతి వేగంగా వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ రహదారి వద్ద స్పీడు బ్రేకర్లు ఉండేవి. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా వీటిని తొలగించడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే బొగ్గు లారీలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండడం మరింత టెన్షన్ పుట్టిస్తోంది. లంకెలపాలెం వైపు నుంచి వచ్చే బొగ్గు లారీలు ఒక్కోసారి సడన్‌గా పరవాడ వైపు మలుపు తిరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిజానికి అవి గాజువాక వైపు వెళ్లే రహదారి గుండా పోవాలి. అయితే డ్రైవర్లు అప్పుడప్పుడు పరవాడ వైపు తిప్పడంతో ఆ సమయంలో అటుగా వచ్చే వాహనదారులు కంగారు పడాల్సి వస్తోంది.

రాత్రి సమయాల్లో మరీ దారుణం...

రాత్రి సమయాల్లో జంక్షన్ వద్ద మరింత దారుణంగా ఉంటోంది. ఎటువైపు వాహనాలు ఎటు వైపు వెళ్తాయో తెలియక గందరగోళం నెలకొంటుంది. దీంతో ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జంక్షన్ సమీపంలో మూడు వైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు పెడితే కొంత మేర ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రయాణికులు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో ఇప్పటి వరకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

వై.జంక్షన్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. భవిష్యత్తును దృష్టి ఉంచుకుని ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-పైలా ముత్యాలనాయుడు, పరవాడ

మట్టి వినాయక విగ్రహాలపై ప్రచారం



జడ్సీకి వినాయక ప్రతిమ అందిస్తున్న కుమారస్వామి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో కమిషనర్ కె.చక్రవర్తిని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఎ. కుమారస్వామి బృందం సోమవారం కలిశారు. వినాయక చవితిరోజున మట్టి విగ్రహాలనే అంతా పూజించేలా ఏటా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందుకు తమవంతు సహకారం అందించాలని వారు జడ్సీని కోరారు. అలాగే మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం వినాయక ప్రతిమను ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవింద, బొట్టా చిన్నియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య ఆలయ వార్షికోత్సవం

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

సబ్బవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గుల్లేపల్లిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వైసీపీ నాయకులు గండి రవికుమార్, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీను, అమ్మతల్లిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లో గల సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపును చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకల రూపంలో రూ.లక్షా 22వేల 158ల ఆదాయం లభించింది. ఈవో బి.మురళి, మాజీ ఛైర్మన్ బొడ్డేడ మురళి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, సిబ్బంది, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యానవన శాఖాధికారిణిగా ప్రియాంక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఉద్యానవనశాఖ అధికారిణిగా ప్రియాంక సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె జడ్సీ చక్రవర్తిని కలిసి రిపోర్టు అయ్యారు. అనకాపల్లిజోనల్ పరిధిలో ఉద్యానవన అభివృద్ధికి కృషి చేయాలని జడ్సీ చక్రవర్తి ఆమెకు సూచించారు.

ఒమ్మివానిపాలెంలో రేషన్ డిపో ప్రారంభం



సరకులు అందిస్తున్న చొక్కాకుల వెంకటరావు

సబ్బవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్మివానిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ డిపోను వీకేపీసీపీఐఆర్ మాజీ ఛైర్మన్ చొక్కాకుల వెంకటరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ రాజేశ్వరి మాట్లాడుతూ అంతకాపల్లి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుంచి రేషన్ సరకులు తెచ్చుకునేందుకు కొంత కాలంగా ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబుకు అందించిన వినతి మేరకు ఆయన ఆదేశాలతో ఇక్కడ డిపో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, నాయకులు రొంగలి దేముడు బాబు, ఎం.మహాలక్ష్మీనాయుడు, పల్ల రమణ, ఒమ్మి కోటి, ఎస్.నర్సింహమూర్తి, నాయుడు, బోకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల వద్ద సభలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వార్డు సచివాలయాల్లో మంగళవారం హౌసింగ్‌కు సంబంధించి సభలు నిర్వహించనున్నామని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ పరిధిలో ఉన్న గొలగాం 1, 2, 3, కోడూరు 1, 4, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, సత్యనారాయణపురం వెస్ట్‌లో ఒక ఇంటి స్థలం మంజూరు చేయబడిన లబ్ధిదారులు ఈ సభలకు హాజరుకావాలని సూచించారు. పైన పేర్కొన్న లేఅవుట్లలో జియోటాగింగ్, ఫేస్ ఆథరైజేషన్ చేయని లబ్ధిదారులు 666 మంది ఉన్నారని, అలాగే ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయని 455 మంది లబ్ధిదారులు ఈ సభలకు హాజరు కావాలని ఆయన కోరారు.

పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం

కశింకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కన్నూరుపాలెంలో రైతులకు సోమవారం యాభై శాతం రాయితీపై పశుదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారిణి డాక్టర్ దయానా మాట్లాడుతూ పశువుల సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో పశువులు ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురైనా వెంటనే పశువైద్య కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ పాడి సంపద వృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగానే పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సర్వం సిద్ధం

▸▸ నేటి నుంచి సీలేరులో కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు



కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న జెన్‌కో సిబ్బంది, యువత

సీలేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీలేరులో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జెన్‌కో సిబ్బంది సోమవారం శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. డీవీవీ పాఠశాల మైదానంలో డే అండ్ నైట్ నిర్వహించే కబడ్డీ పోటీల కోసం కోర్టుకు రెండు వైపులా ఫ్లడ్ లైట్స్, వివిధ రంగుల జెండాలను ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో కోర్టు తడవకుండా టార్పాలిన్స్ కప్పారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి వివిధ సర్కిల్స్ నుంచి 20 కబడ్డీ టీంలు, 10 టగ్ ఆఫ్ వార్ జట్లు వస్తున్నాయి. వీరికి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, ఎకనామిక్స్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్‌లో వివిధ గ్రూప్స్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

చింతపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శిశువులకు తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని తాజంగి గ్రేడ్-1 సూపర్‌వైజర్ జి. సౌజన్య తెలిపారు. సోమవారం చిత్రాళ్లగొప్పు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా బాలింతలతో ఆమె మాట్లాడుతూ శిశువులకు తల్లిపాలు చాలా ఆరోగ్యకరమన్నారు. ప్రతి తల్లి శిశువుకి ఆరు నెలలు పాటు పాలు పెట్టాలన్నారు. బాలింతలు పప్పుధాన్యాలు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న టేక్ హోం రేషన్ తీసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ రమణబాబు

చింతపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్థానిక హౌసింగ్ ఏఈ కె.రమణబాబు అన్నారు. సోమవారం కందులగాది గ్రామంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలో 1,466 గృహాలు నేటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. లబ్ధిదారులు వెంటనే పునాదులు తీసుకుని నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం పునాదుల్లో 1,215, రూఫ్ స్థాయిలో 1,267, శ్లాబ్ స్థాయిలో 358 గృహాలు ఉన్నాయన్నారు. అలాగే పీఎంఏవై 2021-22కి పథకంలో 577మందికి పునాదుల లోపు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.ఐదువేలు జమ చేశామన్నారు. ఈ నగదు తీసుకున్న లబ్ధిదారులు సైతం నిర్మాణాలు చేపట్టడంలేదన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజారావు పాల్గొన్నారు.

నేడు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

పాడేరురూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగుల సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు సోమవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్‌లు జెరాక్స్ కాపీలతో మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఫీజు రియింబర్స్‌మెంట్ సదుపాయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం కళాశాలలో సివిల్ ఎస్టీలకు 9, ఎస్సీలకు 8, ఎలక్ట్రికల్‌లో ఎస్టీలకు 26, ఎస్సీలకు 6, బీసీలకు 2, మెకానికల్‌లో ఎస్టీలకు 27 సీట్లు, ఎస్సీలకు 5, బీసీలకు 1 సీటు ఖాళీలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డుంబ్రిగుడలో భారీ వర్షం



కించుమండ ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండకాయగా, తరువాత వాతావరణం మారిపోయి వర్షం పడింది. ఈ వర్షం వల్ల మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టు గోతిలో ద్విచక్ర వాహనం బోల్తా



గోతిలో పడ్డ వాహనాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బరడ పంచాయతీ పరిధిలోని సొలగంపుట్టు గ్రామ సమీపంలో కల్వర్టు గోతిలో ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ కల్వర్టు గతంలో వర్షాలకు దెబ్బతింది. సోమవారం ఆ గ్రామంలో ఒకరు చనిపోవడంతో ఒడిశాకు చెందిన జగదీస్ హంతాల్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కల్వర్టు పాడైన విషయం తెలియక గోతిలో పడిపోయి స్వల్పంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు చూసి గొయ్యిలో పడిపోయిన వాహనాన్ని అతికష్టంపై బయటకుతీశారు. గాయాలపాలైన జగదీష్‌ను లబ్బూరు ఆసుపత్రికి తరలించారు. కల్వర్టు దెబ్బతిని నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి మనోహర్‌కు వినతుల వెల్లువ



మంత్రి మనోహర్‌కు బొకే అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకుడు పాండురంగస్వామి



మంత్రి మనోహర్‌ను వినతిపత్రాన్ని అందజేస్తున్న జి.మాడుగుల ఎంపీపీ, టీడీపీ నేతలు

పాడేరురూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పాడేరు పర్యటనకు సోమవారం వచ్చిన రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సమస్యలపై పలువురు వినతిపత్రాలను అందించారు. టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంత్రి మనోహర్‌కు పార్టీ నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. పాడేరు మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గిరిజన ప్రాంతంలో ఉన్న పలు సమస్యలను మంత్రికి నివేదించారు. గిరిజన ప్రాంతంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్ డిపోల సమస్యలను పరిష్కరించాలని దారెల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి గడుతుల మురళి, టీడీపీ గోమంగి అధ్యక్షుడు జంపరంగి ధనుంజయ్, టీడీపీ నాయకులు జె.తిరుపతి మంత్రికి వినతిపత్రం అందజేశారు. అలాగే మంత్రి మనోహర్‌ను జి.మాడుగుల ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు సత్కరించారు. అనంతరం డీఆర్ డిపో భవనాల మరమ్మతులు చేపట్టాలని కోరారు. వారి వెంట టీడీపీ నాయకులు మాతే లక్ష్మణరావు, బోయిన బాబూరావు, కొండపల్లి నితిన్‌కుమార్, మాసాడ చిన్నయ్య, పూజారి రమణ, జనసేన నాయకుడు సెగ్గే రామారావు ఉన్నారు. బీజేపీ మైనార్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు రాసపావిడి రాజు, పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, బీజేపీ నాయకులు లకే భాస్కర్, ఎం.గోపాలపాత్రుడు, లకే అబ్బాయిదొర, పి.రవిచంద్ర తదితరులు మంత్రిని కలిసి గిరిజన ప్రాంత సమస్యలను వివరించారు. అలాగే మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయించి నూరు శాతం టీచర్ పోస్టులు ఆదివాసీలకే కేటాయించాలని కోరుతూ పాడేరు, హుకుంపేట మండలాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులు, డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు మంత్రి మనోహర్‌కు వినతిపత్రాలను అందించారు.

పాడేరు వచ్చిన మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నాయకుడు జాగరపు పవన్‌కుమార్ పెదబయలు మండలం వనబంగి పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారనిఆయన తెలిపారు.



మంత్రి మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీలేరు జనసేన నాయకులు

ఆర్వీనగర్-పాలగెడ్డ రోడ్డును నిర్మించండి

▸▸ మంత్రి మనోహర్‌కు జనసేన నేతల వినతి

సీలేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సివిల్ సప్లయ్స్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సీలేరు జనసేన నాయకులు సోమవారం పాడేరులో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రహదారికి నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో మరింత అధ్వానంగా మారిందన్నారు. దీంతో సీలేరు, ధారకొండ, సప్పర్ల పీహెచ్‌సీలోని గర్భిణులు, అత్యవసర రోగులను ఆస్పత్రులకు తరలించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని జనసేన క్లస్టర్ ఇన్‌చార్జి జే బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జీ వీరవెంకట్, ఎస్. వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌కు ఘన స్వాగతం

డుంబ్రిగుడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు మండలంలో ఘన స్వాగతం లభించింది. కించుమండ గ్రామానికి విచ్చేసిన మంత్రికి జనసేన నాయకులు, వీర మహిళలు, టీడీపీ నాయకులు, గిరిజనులు పుష్పగుచ్చాలు అందించిన ఘనంగా స్వాగతించారు. అనంతరం గిరిజనుల పలు సమస్యలపై మంత్రి అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఆర్టీసీ రిజియన్ చైర్మన్ దొన్నుదొర, జనసేన మండల అధ్యక్షుడు దనేశ్వరరావు, నాయకులు ఆనందరావు, సుబ్బారావు, దన్నేరావు, భాస్కరరావు, బాలకృష్ణ, మాలిక్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో మంత్రి నాదేండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న మహిళలు

నిమ్మలపాడు మైనింగ్‌ను సొసైటీకి అప్పగించాలని వినతి

అనంతగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలసీ పంచాయతీలో ఏపీఎండీ పరిధిలో ఉన్న 108 హెక్టార్లలోగల కాల్సైట్ మైనింగ్‌ను స్థానికంగా ఉన్న గిరిజనులకు సొసైటీ ద్వారా నడిపించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాందెడ్ల మనోహర్‌కు వాలసీ పంచాయతీ రాళ్లగరువు, కరకవలస, నిమ్మలపాడు గ్రామస్థులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతగిరి హరితరిస్టార్స్ వద్ద బసచేసిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దీనిపై పరిశీలిస్తామనిమంత్రి గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్లమెంట్ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య, జనసేన మండల అధ్యక్షుడు చిట్టం మురళీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఫొటో ప్రేమ్‌తో ఆహ్వానం

ఏజెన్సీ పర్యటనలో ఉన్న మంత్రి నాందెడ్ల మనోహర్ హరిత రిసార్ట్ వద్ద సోమవారం రాత్రి జనసేన నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనకాపల్లి పట్టణ జనసేన నాయకుడు మంగ ఈశ్వర్ ఆర్ట్‌ను గీయించి, ఫొటో ఫ్రేమ్‌ను కట్టించి, మంత్రికి జ్ఞాపికగా అందజేశారు. అలాగే స్థానిక జనసేన నాయకులు నవీన్, రత్నప్రియ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్యామ్, తదితరులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించాలి

▸▸ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్‌లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం కార్యకర్తలకు పంపిణీ చేసిన ఫోన్‌లను ప్రాజెక్టు కార్యాలయంలో అప్పగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం మోపడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారినా యాప్‌లో గోల తగ్గలేదన్నారు. ప్రస్తుతం ఒక కార్యకర్త ఐదు యాప్‌లను నిర్వహించాల్సి వస్తుందన్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలపై పనిభారం పెరిగిపోవడంతో పాటు సాంకేతిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే యాప్‌ల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం తొలగించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి గుడుతూరి సత్యనారాయణ, ప్రాజెక్టు కార్యదరిశ రాములమ్మ, నాయకులు పెద్ది, గసాడి లక్ష్మి, సత్యవతి, ప్రసన్న పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ల నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

గూడెంకొత్తవీధిలో..

అంగన్‌వాడీ కార్యకర్తలకు యాప్‌ల నిర్వహణ బాధ్యతలు తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ అన్నారు. సోమవారం యాప్‌ల నిర్వహణకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్‌ఫోన్లు ప్రాజెక్టు కార్యాలయానికి అప్పగించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పూర్తి స్థాయిలో సెల్ సంకేతాలు లేవన్నారు. అలాగే ప్రతి రోజూ కార్యకర్తలు ఐదు యాప్‌లను నిర్వహించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే యాప్‌ల భారం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యవతి, సోమలి, అప్పలనర్స, వెంకటి, భూవనేశ్వరి, చిరంజీవి, మేరి పాల్గొన్నారు.

మన్యంలో విభిన్న వాతావరణం

▸▸ ఉదయం పొగమంచు... మధ్యాహ్నం ఎండ, వర్షం

పాడేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సోమవారం విభిన్నమైన వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకు శీతాకాలాన్ని తలపించేలా దట్టంగా పొగమంచు కమ్మేసింది. తర్వాత నుంచి ఎండ మొదలై ఒంటి గంట, రెండు గంటల సమయంలో తీవ్రమైన ఎండకాసింది. అలాగే పాడేరు ఘాట్‌లో, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లో భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ, వాన మాత్రమే ఏర్పడగా, సోమవారం అందుకు భిన్నంగా ఉదయం పొగమంచు తోడైంది. విభిన్నమైన వాతావరణం ఏర్పడినప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం తగ్గడం లేదు. దీంతో సోమవారం కొయ్యూరులో 36.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 34.3, పాడేరులో 34.0, చింతపల్లిలో 31.5, హుకుంపేటలో 31.3, పెదబయలు, డుంబ్రిగుడలో 31.2, అనంతగిరిలో 30.5, జి.మాడుగులలో 30.2, ముంచంగిపుట్టులో 29.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సోమవారం ఉదయం పొగమంచులో పాడేరు నుంచి సిరిబాలకు లైట్లు వేసుకుని వెళుతున్న ఆర్టీసీ బస్సు

సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ వేయాలి

▸▸ సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం ▸▸ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



అనకాపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆమె జిల్లా అధికారులతో కలిసి మండలాభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో శతశాతం వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. చెత్తకుప్పలు నిల్వలేకుండా ఏ రోజుకు ఆ రోజు తొలగించేలా చర్యలు చేపట్టాలని వివరించారు. అలాగే, గ్రామాల్లో మురుగు కాలువలను, రోడ్లను శుభ్రపరచాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు విజృంభించినా, అంటు వ్యాధులు సోకినా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

చింతాలమ్మ ఘాట్‌లో పటిష్ఠ రక్షణ చర్యలు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



కొండ వద్ద పీచుకార్పెట్లు, పైన ఇనుప మెష్‌లను అమర్చిన దృశ్యం

కొయ్యూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చింతాలమ్మఘాట్‌లో జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టరు రక్షణ చర్యలు పటిష్ఠం చేశారు. జూలై 29న 'ఆంధ్రజ్యోతి'లో 'రక్షణ చర్యలు ఇలాగేనా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి కాంట్రాక్టరు స్పందించారు. చింతాలమ్మ ఘాట్ మలుపుల్లో దొలిచిన కొండ నుంచి మట్టి, రాళ్లు జారి పడకుండా పీచు కార్పెట్లు అమర్చడం విమర్శలకు తావిచ్చింది. ఈ రక్షణ చర్యలతో భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కొండను దొలిచిన వద్ద బండరాళ్లు, మట్టి జారి పడకుండా అమర్చిన పీచు కార్పెట్లు పైన ఇనుప చిక్కాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టించేందుకు పలువురు 'ఆంధ్రజ్యోతి'ని అభినందించారు.

'రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'



పండ్ల మొక్కలను అందిస్తున్న సత్యవతి

కొయ్యూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మహిళ మండల అధ్యక్షురాలు సత్యవతి అన్నారు. సోమవారం డౌనూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన జామ, మామిడి, కొబ్బరి, సపోటా, సీతాఫలం మొక్కలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా సుస్థిర పరచాలనే పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షురాలు గోలి దేవి, నేతలు రీముల జగన్, ఫీల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

సీలేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల తొమ్మిదోవ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీల అఖిల పక్ష నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ధారకొండ హనుమాన్ జంక్షన్ వద్ద వీరంతా సమావేశమై.. ఆదివాసీ దినోత్సవాన్ని ఎక్కడ నిర్వహించాలనే అంశంపై చర్చించారు. ఆ రోజు ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు, సచివాలయం సిబ్బంది, అటవీ శాఖ, వైద్య సిబ్బంది, వ్యాపారస్థులు పాల్గొనాలని అఖిల పక్ష నేతలు కోరారు. ఈ సమావేశంలో అఖిల పక్షనాయకులు పోతురాజు గోవింద్, శోభ జగన్, సత్యమూర్తి, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

బర్లుపుట్టులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయరూ..

పాడేరురూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల కించూరు పంచాయతీ పరిధిలోని బర్లుపుట్టు పీవీటీజీ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. పౌష్టికాహారానికి గర్భిణీలు, బాలింతలతో పాటు ఆరేళ్ల లోపు చిన్నారులు 15 మంది వరకు ఉన్నారన్నారు. పౌష్టికాహారం కోసం 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న బంత్రోతుపుట్టు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



బంత్రోతుపుట్టు అంగన్‌వాడీ కేంద్రం నుంచి బర్లుపుట్టుకు పౌష్టికాహారాన్ని తీసుకువెళ్తున్న లబ్దిదారులు

15లోగా వసతిగృహాన్ని ప్రారంభించాలి

అరకులోయ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతబంసుగూడ వద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేజీబీవీ టైప్-4 వసతిగృహాన్ని ఏపీసీ స్వామినాయుడు, డీఈ వేణుగోపాల్ సోమవారం సందర్శించారు. రూ.2 కోట్లతో విద్యార్థినుల కోసం నిర్మించిన వసతిగృహాన్ని ఈ నెల 15వ తేదీలోగా ప్రారంభించాలని స్వామినాయుడు ఆదేశించారు. వంద సీట్లకుగాను 80 సీట్లకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నారని, మిగిలిన 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అనంతరం పలు విషయాలపై హెచ్ఎం, వార్డెన్‌కు పలు సూచనలు చేశారు.

తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ముంచంగిపుట్టు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దారెల పంచాయతీ పరిధిలోని పెద్దపేట-పేటమాలిపుట్టు తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం సర్పంచ్ పాండురంగస్వామి శంకుస్థాపన చేశారు. రూ.53 లక్షలు వెచ్చించి సుమారు కిలోమీటరు బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఈ సందర్భంగా సర్పంచ్ చెప్పారు. టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, దశల వారీగా అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పి.మల్లికార్జునరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీశ్‌దొర, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గోపాల్, పెసా ఉపాధ్యక్షుడు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.6 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి...

పెదబయలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొరవంగి పంచాయతీ పరిధిలోని కొరవంగి జంక్షన్ నుంచి కోనాపుట్టు వరకు రెండున్నర కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పెదబయలు మండల అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య, ప్రధాన కార్యదర్శి కొర్ర రాజారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.6 కోట్లతో ఈ పక్కా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.బాలయ్య, నాయకులు వినోద్, రాజేంద్రప్రసాద్, బాలక్రిష్ణ, మత్యరాజు పాల్గొన్నారు.

రాయిమామిడిలో డ్రైనేజీ పనులకు...

పెదబయలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగి పంచాయతీ కేంద్రం రాయిమామిడి గ్రామంలో జడ్పీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు మాట్లాడుతూ జడ్పీ నిధులు రూ.5 లక్షలతో 85 మీటర్లు పొడవు గల డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. కాలువ లేకపోవడంతో గ్రామంలో ఎక్కడబడితే మురుగు నిలిచిపోతున్నదని, ఇకపై ఈ సమస్య తీరుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు కొర్ర సత్తిబాబు, భాస్కరరావు, వార్డు సభ్యులు శ్రీకన్య, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో సర్కారీ కొలువుల సందడి

నిరుపేద బిడ్డలకు దక్కిన సదవకాశాలు

- రైతు, కూలీల కుటుంబీకుల పిల్లలకు ఉద్యోగాలు
- పోలీసు కానిస్టేబుల్ పోస్టులు సాధించిన యువత



లక్ష్మీపురంలో తమను ప్రోత్సహించిన రాజేశ్ దంపతులను సత్కరిస్తున్న కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులు

చోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వారంతా సాధారణ వ్యవసాయ కుటుంబీకుల పిల్లలు. కూలి చేసుకుని జీవనాధారం సాగించే నిరుపేదలు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో ఉద్యోగాలు సాధించి ప్రతిభను చాటుకున్నారు. ఇప్పుడు గ్రామాల్లో వారి కుటుంబీకులు, స్థానిక ప్రజలు ఆనందంలో ఉబ్బితబ్బిబవుతున్నారు. చాలా కాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూసి వేసారిన వారంతా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సర్కారీ కొలువులు సాధించడంతో ప్రస్తుతం పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన యువకులను ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు, వారు చదివిన కాలేజీ అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

మండలంలోని ఖండేపల్లికి చెందిన గ్రాడ్యుయేట్ చప్పగడ్డి చంద్రరావు 138 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయ్యాడు. అలాగే ఇక ఇదే గ్రామానికి చెందిన పోస్టు గ్రాడ్యుయేట్ కడిమి జనార్ధన్ 140 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టు సాధించాడు. అలాగే గ్రాడ్యుయేషన్ చేసిన వేపాడ రాజు 128.5 మార్కులు, చప్పగడ్డి గణేశ్ 122.5 మార్కులు, కొమార కిశోర్ 121.5 మార్కులతో ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఇక లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోస్టు గ్రాడ్యుయేట్ పెద్దాడ రాము 144 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన గ్రాడ్యుయేట్ ఇల్లపు నూకరాజు కూడా 149 మార్కులతో సివిల్ కానిస్టేబుల్ పోస్టు సాధించాడు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు చెందిన వీరందరిదీ వ్యవసాయ కుటుంబాలే కావడం విశేషం.

మండలంలోని లక్ష్మీపురం, ఖండేపల్లి గ్రామాలకు ఏడుగురు యువకులు పంచాయతీలో పోలీసు ఉద్యోగాలు సాధించడానికి, రెండు గ్రామాలలో లైబ్రరీ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు అవసరమైన తోడ్పాటు అందించిన చోడవరం నివాసి, ప్రస్తుతం విశాఖలో పీబీఎల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న రాజేశ్ దంపతులను సర్పంచులు సిరిసోళ్ల గంగాభవానీ, సేనాపతి రాజశేఖర్, ఆదిగణపతినాయుడులతో పాటు సోమవారం ఘనంగా సత్కరించారు. అలాగే పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన డిగ్రీ కాలేజీ విద్యార్థులను సోమవారం కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన చప్పగడ్డి చంద్రరావు... కడిమి జనార్దన్... వేపాడ రాజు... చప్పగడ్డి గణేశ్... కొమార కిశోర్... పెద్దాడ రాము... ఇల్లపు నూకరాజు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల విజేతలకు ఎమ్మెల్యే రాజు అభినందనలు



జాతీయ స్థాయి పోటీల విజేతలతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, కోచ్‌లు

చోడవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం అభినందించారు. గత నెల 25 నుంచి 28వ తేదీ వరకూ విజయవాడలో నిర్వహించిన పదో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిలో చోడవరానికి చెందిన క్రీడాకారులు కూడా ఉన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఎమ్మెల్యే అభినందించడంతో పాటు కోచ్‌లను కూడా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ, కోచ్‌లు ప్రదీప్‌కుమార్, శేఖర్, అర్రెపు శ్రీను, మహేశ్, ఉపాధ్యాయులు బీవీ కిశోర్, సింహాచలం, రాము, దేవర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోకులాల షెడ్ల బిల్లులకు దరఖాస్తుల స్వీకారం



గోకులాల షెడ్ల బిల్లుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీవో

మాకవరపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గోకులాల షెడ్ల బిల్లుల మంజూరుకు ఏపీవో కాశీనాయుడు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో 150 గోకులాల షెడ్లను మంజూరు చేశారు. దీంతో రైతుల వాటా కింద కొంత మొత్తం నగదు చెల్లించి షెడ్ల నిర్మాణం పూర్తిచేశారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారం రావడంలోకి రావడంతో బిల్లులు గోల్‌మాల్‌కు దారి తీశాయి. రైతుల బిల్లులు ప్రైవేటు సంస్థ ఖాతాలోకి వెళ్లాయి. దీనిపై రైతులు స్పందనలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీనిపై విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మండలంలోని 150 మంది రైతుల నుంచి బిల్లుల కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటికైనా గోకులాల షెడ్ల బిల్లులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలు కురవాలని హోమం



కోటమ్మతల్లి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నాతవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలు కురవాలని వేడుకుంటూ కోటమ్మతల్లి ఆలయంలో సోమవారం ప్రత్యేకంగా హోమం చేశారు. మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, లక్ష్మీ దంపతులు వేద పండితులతో ఈ హోమం నిర్వహించారు. వర్షాలు లేకపోవడంతో వరి నారు ఎండిపోతూ రైతులు ఇబ్బంది పడుతున్నారని, వేద పండితుల సూచన మేరకు కోటమ్మతల్లి ఆలయంలో ఈ హోమం నిర్వహించామని మాజీ ఎంపీపీ కొండబాబు చెప్పారు. అనంతరం రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, నాయకులు ఎ.రాంబాబు, శెట్టి శ్రీనివాసరావు, సీతారామ్మూర్తి, శెట్టి నానాజీ, శెట్టి లచ్చబాబు, అంకంరెడ్డి రమణ కొండబాబు దంపతులను సత్కరించారు.

ఆదర్శ పాఠశాలలో మందుబాబుల వీరంగం

- నీటి సరఫరా కుళాయిలు, పైపుల ధ్వంసం



ధ్వంసమైన కుళాయిలను చూపిస్తున్న డీజీనాథ్

నర్సీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శివపురం మోడల్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో మందుబాబులు వీరంగం సృష్టించారని ఉపాధ్యాయులు వాపోయారు. ఆదివారం రాత్రి పాఠశాల ఆవరణలో మద్యం తాగి నీటి సరఫరా ట్యాప్‌లు, పైపులు ధ్వంసం చేశారని ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. పాఠశాలలో 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ ఆవరణలో మానసిక వైకల్యంతో బాధ పడుతున్న పిల్లల కోసం భవిత కేంద్రం నడుపుతున్నారు. పిల్లలు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడానికి కుళాయిలు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి స్కూల్ ఆవరణలోకి ప్రవేశించిన మందుబాబులు కుళాయిలను ధ్వంసం చేశారు. దీంతో భవిత కేంద్రంలోని దివ్యాంగులు, పాఠశాల విద్యార్థులు బోరు నీటిపై ఆధారపడుతున్నారు. అలాగే కిటికీల తలుపుల విరగ్గొట్టి లోపల ఉన్న మొక్కలను విసిరేశారు. సరస్వతీ నిలయంలో మందుబాబు వీరంగం సృష్టించడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు, పోలీసుల దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు.

సొసైటీని అభివృద్ధి బాటలో నడిపించండి

- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఛైర్‌పర్సన్‌గా టీడీపీ సీనియర్ నేత చీపురుపల్లి రామారావు, డైరెక్టర్లుగా రుద్ర ఈశ్వరరావు, దొగ్గ వెంకటరావుతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల అభీష్టం మేరకే రామారావు ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారన్నారు. ఎలాంటి మచ్చ లేకుండా సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. సంఘ సభ్యులకు ప్రతి పైసా ఆచితూచి ఇవ్వాలని, నిజాయితీగా పనిచేయాలని చెప్పారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని, పరిపాలన బాగున్నప్పుడే ప్రజలు నాయకులకు చేరువవుతారని ఆయన పేర్కొన్నారు. ఛైర్‌పర్సన్ రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

అంతకు ముందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన పామ్ బజార్ (వెజిటబుల్స్ అండ్ ఫ్రూట్స్ మొబైల్ వెహికల్)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. డి.అగ్రహారం గ్రామానికి చెందిన గణేశ్ గ్రూపు సభ్యురాలు వేచలపు సత్యవతికి ఈ వాహనాన్ని అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ, ఏపీసీఎంఎఫ్ డీపీఎం లచ్చన్న, ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దార్ భుజంగరావు, ఏపీఎం చినబాబు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.మహేశ్, సర్పంచ్ యర్రంశెట్టి భవాని, నాయకులు ఎస్.రాము నాయుడు, జూరెడ్డి రాము, బత్తి వెంకటరమణ, డి.ఎరుకునాయకుడు, కె.సూర్యనారాయణ, కె.అప్పలనాయుడు, వి.పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

భారీ వర్షం... జనం ఉపశమనం

చోడవరం/మాడుగుల/కృష్ణాదేవిపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వేసవిని తలపించే ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు సోమవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. చోడవరం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మధ్యాహ్నం వరకు భీకరంగా ఎండ కాసింది. తరువాత హఠాత్తుగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

అలాగే కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, కొంగశింగి, చోద్యం, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పది రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఊరట చెందారు. వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కృష్ణాదేవిపేట వారపుసంత వెలవెలబోయింది. మాడుగుల మండలంలో మాదిరిగా వర్షం కురిసింది. వారం రోజులుగా వేసవిని తలపించే ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాగే రైతులు, వ్యవసాయ కూలీలు నారుమడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ దశలో వాన పడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చోడవరం ప్రధాన రహదారిపైన... ఏఎల్.పురంలో హోరున పడుతున్న వాన



ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

రావికమతం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న వివిధ సేవలు ఆన్‌లైన్‌లో నమోదుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన మొబైల్ ఫోన్లను సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి సోమవారం అప్పగించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం ప్రతినిధి ఎస్.సత్యవేణి మాట్లాడుతూ మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఇచ్చిన టుజీ ఫోన్లు నెట్‌వర్క్ వేగానికి అనుగుణంగా పనిచేయడం లేదని, దీనివల్ల ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో పోషక పదార్థాలను లబ్ధిదారులకు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. లాగే రోజువారీ సమయమంతా ఆన్‌లైన్‌లో నమోదుకే సరిపోతున్నదని వాపోయారు. మంగళవారం నుంచి పూర్వ పద్ధతిలో పుస్తకాల్లోనే లబ్ధిదారుల సంతకాలు చేయించుకుని పోషక పదార్థాలను పంపిణీ చేయాలని నిర్ణయించామని ఆమె తెలిపారు. సీడీపీవో మంగతాయారు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు.

వర్మీకంపోస్టు అమ్మకం

చీడికాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద మండలంలోని జి.కొత్తపల్లి గ్రామం నుంచి ఏర్పాటు చేసిన సేల్స్ కౌంటర్‌కు మంచి స్పందన వచ్చిందని డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖరరావు చెప్పారు. జిల్లా పంచాయతీ కార్యాలయం ఆదేశాల మేరకు జి.కొత్తపల్లి గ్రామంలో వ్యర్థ పదార్థాల ద్వారా తయారుచేసిన వర్మీకంపోస్టును, గ్రామంలో పండించిన కూరగాయలను కలెక్టరేట్ వద్ద స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టినట్టు చెప్పారు. వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చిన వారికి 180 కిలోల వర్మీకంపోస్టును కిలో రూ.10కే అమ్మకాలు చేశామన్నారు. అలాగే కొబ్బరి బొండాలు, కూరగాయలు పూర్తి స్థాయిలో అమ్మకాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, సిబ్బంది పాల్గొన్నారు.



జి.కొత్తపల్లి వర్మీకంపోస్టు, కూరగాయలతో ఏర్పాటు చేసిన కౌంటర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 21 వినతులు



పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న పరిపాలనాధికారి సుధాకర్

నర్సీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సుధాకర్ 21 వినతిపత్రాలు స్వీకరించారు. తాండవ పంట కాలువను కలుపుకొని భూములు ఇంటి స్థలాలు కింద అమ్ముకోవడంతో రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెర్లోపాలెం గ్రామానికి చెందిన అన్నంరెడ్డి వెంకటరమణ ఫిర్యాదు చేశారు. అలాగే తన పెంపుడు కొడుకుకు రాసిచ్చిన ఇల్లు, స్థలాలు రద్దు చేసి, తిరిగి ఇప్పించాలని ఎస్.రాయవరం మండలం సైతారుపేటకు చెందిన కర్రి పైడితల్లి విన్నవించారు. ఆస్తి రాయించుకున్న తర్వాత తన బాగోగులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసింది. పీజీఆర్ఎస్‌లో అధికంగా భూ సమస్యల మీద వినతులు వచ్చాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అన్‌రాక్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ



న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ సమక్షంలో నిర్వాసితులకు చెక్కులు అందిస్తున్న ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ అనిత

నర్సీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్‌రాక్ భూ నిర్వాసితుల సమస్యకు మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయం చేకూరింది. కంపెనీకి భూములు ఇచ్చిన 21 మంది నిర్వాసితులకు పరిహారం అందక అధికారుల చుట్టూ తిరుగారు. ఈ సమస్యను మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ పి.షియాజ్‌ఖాన్‌కు జనవరిలో నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన అన్‌రాక్, నిర్వాసితులను విచారించారు. సోమవారం న్యాయమూర్తి సమక్షంలో ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్ అనిత చేతుల మీదుగా పరిహారం సొమ్ము చెక్కులు అందజేశారు. పరిహారం అందుకున్న నిర్వాసితులు న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.

కొండెపూడి మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవాలు



ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెపూడి మరిడిమాంబ ఆలయం ప్రారంభోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో ఆలయం ప్రారంభించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సర్పంచ్ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు.



ఆపరేషన్ చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందిస్తున్న కౌన్సిలర్ రాజేశ్

150 మందికి కళ్లద్దాల పంపిణీ

నర్సీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు మందగించిన 150 మందికి 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ సోమవారం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ గో హస్పటల్స్, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు 500 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 21 మందికి శస్త్ర చికిత్సలకు, చూపు మందగించిన 150 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో సోమవారం క్యాంప్ ఆఫీసులో గో హస్పటల్స్ సౌజన్యంలో లబ్ధిదారులకు కౌన్సిలర్ రాజేశ్ కళ్లద్దాలను పంపిణీ చేశారు.

నేడు కల్యాణపులోవ నీరు విడుదల

రావికమతం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలశయం నీటిని మంగళవారం ఆయకట్టుకు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఏఈ డి.సూర్య తెలిపారు. సోమవారం ఏఈ సూర్య మాట్లాడుతూ 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ కింద 4,484 ఎకరాల ఆయకట్టు భూములకు ఏటా సాగు నీరు అందించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది సకాలంలో రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రిజర్వాయర్‌లో ఆయకట్టు సాగుకు అవసరమైనంత నీటి నిల్వలు చేరలేదన్నారు. ప్రస్తుతం 450.08 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయని, వరి నారు మడులు ఎండిపోతుండడంతో ఆయకట్టు ఛైర్మన్, రైతుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని చెప్పారు. అయితే రిజర్వాయర్‌లో నీరు తక్కువగా ఉన్నందున కేవలం నారు మడులను మాత్రమే తడుపుకోవాలని ఏఈ తెలిపారు.

సాగులో లేని భూములకు ఈక్రాప్ నమోదు చేయాలి

గొలుగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగులో లేని భూములకు ఈ క్రాప్ నమోదు చేయాలని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ఈ క్రాప్ పంటల నమోదు చేయాలన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలసిన జన సైనికులు

మాడుగుల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జన సైనికులు మర్యాద పూర్వకంగా కలిశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్‌లో జరిగే సమీక్షకు మంత్రితో పాటు సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ కోన తాతారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబును ఘాట్ రోడ్డు జంక్షన్‌లో కలిసి మండల సమస్యలపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఈ సందర్భంగా జన సైనికులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసైన నాయకులు రొబ్బా మహేశ్, దాసరి అచ్యుతరావు, ఎం.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పిల్లా నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డిపోలో తహశీల్దార్ తనిఖీలు

రోలుగుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరవోలులో రేషన్ డిపోలో తహశీల్దార్ నాగమ్మ సోమవారం తనిఖీలు చేపట్టారు. దుకాణంలో ఉన్న బియ్యం బస్తాలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా? అని డీలర్ రవిని అడిగి తెలుసుకున్నారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులోనే అందుబాటులో ఉండి లబ్ధిదారులకు సక్రమంగా సరకులు అందించాలని ఆదేశించారు. వృద్ధులకు ఇంటి వద్దకే సరకులు పంపిణీ చేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెడును వదిలితే భవిష్యత్తు బంగారం

దేవరాపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): చెడును విడనాడితే భవిష్యత్తుకు బంగారు బాట పడుతుందని ఎస్ఐ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు కర్రలతో విచక్షణరహితంగా కర్రలతో కొట్టుకోవడంపై ఆయన మందలించారు. ఇలా చెడు మార్గం పట్టకూడదని స్పష్టం చేశారు. హెచ్ఎం సిహెచ్.ఉమ సమక్షంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

దేవరాపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. పదో తరగతి సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడడంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని చెప్పారు. విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమదిన గ్రామంలో సర్వే నంబర్ 81లో 158 ఎకరాల విస్తీర్ణం గల భూమిని కాపాడాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిలో ఆక్రమణకు పాల్పడుతున్నారని అఖిలపక్ష నేతలు కె.అచ్చంనాయుడు, సిహెచ్.బాబూరావు, జె.కొండబాబు, కె.వెంకటరావు, ఎ.నాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వెంట వై.ఈశ్వరరావు, చొప్ప మరిడిబాబు, డి.పరదేశినాయుడు, ఎస్.గోవింద తదితరులు ఉన్నారు.

నందనవనం.. ఆహ్లాదం!

- ఉద్యానవనంలా ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ పార్కు
- రూ.40 లక్షలతో అభివృద్ధి చేసిన పంచాయతీ పాలకులు
- పిల్లలకు ఆటల పరికరాలు, పెద్దలకు ఓపెన్ జిమ్
- సాయంత్రంపూట ఉల్లాసంగా గడుపుతున్న స్థానికులు


పార్కులో చిన్నారుల సందడి


పార్కులో కనువిందు చేస్తున్న పచ్చదనం


పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

పరవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ.బోనంగి ఫార్మా పునరావాసకాలనీలో ఏర్పాటు చేసిన పార్కు.. నందనవనాన్ని తలపిస్తున్నది. కాలనీవాసులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు చక్కటి ఆహ్లాదాన్ని పంచుతున్నది. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఉల్లాసంగా... ఉత్సాహంగా గడుపుతున్నారు. సుమారు 70 సెంట్ల స్థలంలో పంచాయతీ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి గత ఏడాది సెప్టెంబరులో అన్ని హంగులతో పార్కును అందుబాటులోకి తీసుకు వచ్చారు. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ అందరినీ ఆకట్టుకుంటున్నది. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు వివిధ పరికరాలతోపాటు పెద్దలు వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం నడిచే వారి కోసం వాకింగ్ ట్రాక్‌లు, సేద తీరేందుకు 12 బెంచీలు, చీకటి పడిన తర్వాత కూడా పార్కులో గడిపేందుకు హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు.

పార్కు నిర్వహణకు సిబ్బంది

- బొద్దపు శ్రీనివాసకాసులు, సర్పంచ్, ఈ.బోనంగి



పార్కు నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. రోజూ పార్కును శుభ్రం చేస్తారు. అన్ని రకాల మొక్కలకు నీరు పోస్తారు. ఇందుకోసం బోరు, కొళాయిలను ఏర్పాటు చేశాం. పార్కు నిర్వహణ బాగుండడంతో రోజూ పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో వచ్చి ఉల్లాసంగా గడుపుతున్నారు.

సబ్బవరం పీఏసీఎస్‌కు ఉత్తమ ప్రతిభ అవార్డు


మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న గొంప రమణ

సబ్బవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ పనితీరు కనబరిచిన సబ్బవరం దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 2023-24 ఏడాదికిగాను ప్రతిభ అవార్డు దక్కింది. సోమ వారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కె.అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సీఈవో గొంప రమణ అవార్డు అందుకున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఎన్నిక


అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి విజయ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ ఫెడరే షన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) అనకాపల్లి జిల్లా కమిటీ ఎన్నిక సోమవారం ఇక్కడ దొడ్డి రామునాయుడు జరిగింది. అధ్యక్షుడిగా ఎం.బాలాజీ, కార్యదర్శిగా పి.విజయ్, గర్ల్స్ కన్వీనర్‌గా పి.వెంకటకుమారి, ఉపాధ్యక్షులుగా పి.కృపానంద, డి.దివాకర్, గౌతం, రూపేంద్ర, సత్యనారాయణ, చేపల రాము, చిన్ని, విష్ణు, మోహన్ సాయి, రమ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనంలో వివిధ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు.

జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మోసా అప్పలరాజు


మోసా అప్పలరాజుకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.నగేశ్‌బాబు

పాయకరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాయకరావుపేట మండలం కొర్లయ్యపేట గ్రామానికి చెందిన మోసా అప్పలరాజు మరోమారు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సోమవారం జాతీయ మత్స్యకార సంఘం ప్రధాన కార్యదర్శి అనంత నగేశ్‌బాబు చేతుల మీదుగా అప్పలరాజు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో రాష్ట్రంలో మత్స్యకార సంఘం మరింత బలోపేతం అయ్యేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

అర్జీలపై క్షేత్రస్థాయిలో పర్యటన

- సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌లో 284 అర్జీలు స్వీకరణ


అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందే అర్జీలపై అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమెతోపాటు జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావు ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఒకే సమస్యకు సంబంధించి కొంతమంది పదేపదే అర్జీలు ఇస్తున్నారని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఒకవేళ నిబంధనల ప్రకారం అర్జీని పరిష్కరించడం వీలుకాని పక్షంలో ఆ విషయాన్ని అర్జీదారులకు అర్థం అయ్యేలా చెప్పాలన్నారు. అర్జీ స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు కాల్ చేస్తే.. వివరాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించి 284 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, సీపీవో జి.రామారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా పాల్గొని పౌరుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ అర్జీలను నిశితంగా పరిశీలించి, ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మొత్తం 31 అర్జీ లు అందగా వీటిలో ఆస్తితగాదాలు, కుటుంబ కలహా లు, మోసాలు వంటివాటికి సంబంధించినవి అధికంగా వున్నాయి.

ప్రభుత్వ భూమి కబ్జా

- వాడచీపురుపల్లిలో 55 సెంట్లు ఆక్రమణకు యత్నం
- ఎక్స్‌కవేటర్‌తో చెట్లు కూల్చివేత
- స్థానికుల ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారులు కూల్చివేసిన చెట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పరవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడచీపురుపల్లి (ఈస్టు) రెవెన్యూ పరిధి సర్వే నంబరు 205లోగల ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం పంచాయతీకి చెందిన కొంతమంది వ్యక్తులు, వాడచీపురుపల్లి (ఈస్టు) రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 205లోగల 55 సెంట్ల ప్రభుత్వ భూమిలో తాటిచెట్లు, జీడిమామిడి చెట్లను తొలగించి కబ్జా యత్నించారు. స్థానికులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో అప్పారావు, వీఆర్ఏలు వచ్చారు. వీరి రాకను గమనించిన ఆక్రమణదారులు అక్కడి నుంచి జారుకున్నారు. చెట్ల తొలగించడానికి ఉపయోగించిన ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలావుండగా వాడచీపురుపల్లి (ఈస్టు) రెవెన్యూ పరిధి సర్వే నంబరు 205లో వున్న ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు అర్జీ అందజేశారు. నాయుడుపాలెం పంచాయతీకి చెందిన బండారు పైడంనాయుడు, బండారు శ్రవణ్, బాలకృష్ణ, అప్పలరాజు, మరికొంతమంది వ్యక్తులు కలిసి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించి సిబ్బందిని తమ గుప్పెట్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులు ఉపాధి పనులకు రాకుండానే, పనులు చేసినట్టుగా రికార్డుల్లో నమోదు చేయించి, అక్రమంగా కూలి డబ్బులు పొందుతున్నారు.ఈ తరహా అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో గ్రామాల్లో సోషల్ ఆడిట్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు బట్టబయలు అయ్యాయి. ఇతర ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేసే వారికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు వుండడమే కాకుండా, పనులకు వస్తున్నట్టు రికార్డుల్లో నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్న విషయం బయటపడింది. దీంతో బాధ్యులైన ఉద్యోగులను విధుల నుంచి తప్పించారు. సోషల్ ఆడిట్‌తో ఇటువంటి అక్రమాలకు కొంతమేర అడ్డుకట్టపడింది. అయితే ఏకపక్షంగా రాజకీయ ఆధిపత్యం వున్న గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవినీతి కొనసాగుతూనే వుంది. దీంతో ఉపాధి హామీ పథకాన్ని అవినీతిరహితంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతోపాటు సంబంధిత అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి రోజూ ఉపాధి కూలీలు పనిచేసేచోట రెండుసార్లు.. ఉదయం పనిలోకి రాగానే ఒకసారి, సాయంత్రం నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటోలు తీసి, సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒకవేళ పనిచేసే ప్రదేశంలో నెట్ సిగ్నల్స్ సరిగా లేకపోతే.. ఫొటో తీసి, రాత్రి 12 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు ఫొటోల్లో వుంటేనే.. వేతనాల చెల్లింపు జరుగుతుంది. కొత్త విధానాన్ని ఈ నెల నాలుగో తేదీ నుంచే అమలు చేయాలని ఆదేశించింది. అయితే కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఈ నెల 10వ తేదీ నుంచి కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు

... 5వ పేజీ తరువాయి

వేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే కనిపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే, పత్రికల్లో కథనాలు వస్తే.. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి రియల్టర్ల నుంచి కొంత మొత్తం కట్టించుకొని చేతులు దులుపుకుంటున్నారు.

క్రమబద్ధీకరణకు అవకాశం

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఆగస్టుకు ముందు అనుమతులు లేకుండా వేసిన వెంచర్లకు ఎల్ఆర్ఎస్ వర్తిస్తుంది. అదే విధంగా ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు అనధికార లేఅవుట్‌లకు మార్కెట్ విలువలో ఏడు శాతం సొమ్మును ప్రభుత్వానికి చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు.

అనధికార లేఅవుట్ల వివరాలు సేకరిస్తున్నాం

- ఇ.సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో అనధికార లేఅవుట్‌ల వివరాలను సేకరిస్తున్నాం. వీఎంఆర్‌డీఏ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ అధికారుల ద్వారా అనుమతి వున్న లేఅవుట్లు, అనధికార లేఅవుట్‌ల గురించి సమాచారాన్ని రపిస్తున్నాం. త్వరలోనే వివరాలు వెల్లడిస్తాం. అనుమతులు లేని లేఅవుట్‌ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS

FINANCE

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్థులకు సులభవాయిదా పద్ధతిలో 5లక్షల లోపు ఫైనాన్స్ చేయబడును. స్థిరాస్తిపై బ్యాంకులో లోను తీసుకున్నవారికి కూడా జిరాక్స్ పేపర్స్‌పై సెకండ్ మార్టిగేజ్ లోన్ చేయబడును. సెల్: 9396999669
AJD-244810

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

జడ్పీ చైర్‌పర్సన్‌పై చల్లారని అసమ్మతి

... 5వ పేజీ తరువాయి

ఇస్తున్నట్టు చెబుతున్నా బల ప్రదర్శన కోసమే ఈ సమావేశం ఏర్పాటుచేస్తున్నట్టు పార్టీలో ప్రచారం సాగుతుంది. విందు సమావేశానికి రావాలని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్రను కూడా సత్యం ఆహ్వానించారు. అయితే తనపై కొందరు జడ్పీటీసీ సభ్యులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తంచేయడం, పెద్దల ముందు పంచాయితీ నిర్వహించిన నేపథ్యంలో ఆత్మీయ కలయిక సమావేశానికి వెళ్లకూడదని చైర్‌పర్సన్ నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు.

చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఉండే జడ్పీటీసీ సభ్యులు ఈ విందు సమావేశానికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. అంతేకాకుండా తమకు బాగా సన్నిహితంగా ఉండే సభ్యులను కూడా వెళ్లొద్దని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వ్యతిరేకవర్గం ఎక్కువ మంది మామిడిపల్లి వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. ఆత్మీయ కలయిక అనేది రాజకీయాల కోసం కాదని, కేవలం అందరం కలుసుకునేందుకు మాత్రమే ఈ సమావేశం ఏర్పాటుచేస్తున్నామని ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం సహచర సభ్యులకు పంపిన వాట్సాప్ ఆహ్వానంలో పేర్కొన్నారు. కాగా మంగళవారం దేవరాపల్లిలో విందు సమావేశం ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో వైసీపీ నేతలు కొందరు రంగంలోకి దిగి మరోసారి రాజీ కుదిర్చేలా చర్చలు జరిపారని ప్రచారం సాగుతుంది. దీనికి సంబంధించి ఆదివారం నగరంలో ముఖ్య నేతలంతా భేటీ అయి చర్చించారని చెబుతున్నారు. చైర్‌పర్సన్ పదవీకాలం ఇంకా ఏడాది మాత్రమే ఉన్నందున ఇప్పుడు అవిశ్వాసం పెట్టి పార్టీని ఇరకాటంలో పెట్టడం కంటే మధ్యేమార్గంగా ఆలోచన చేయాలని భావిస్తున్నట్టు కొందరు సభ్యులు అంతర్గత సంభాషణలలో చర్చించుకున్నారు. మంగళవారం నాటి సమావేశం తరువాత సభ్యులందరితో మరోసారి విశాఖలో సమావేశం ఏర్పాటుచేయాలని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి


గోపాల్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం గ్రామానికి చెందిన వ్యక్తి, ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఇతని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కుమారపురానికి చెందిన చుక్కా గోపాల్‌రెడ్డి(48) తునిలో ఒక ప్రైవేటు సంస్థ తరఫున ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా తుని పట్టణంలోని వీరవరపుపేట వద్ద కుక్కలు అడ్డుగా వచ్చాయి. దీంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో గోపాల్‌రెడ్డి తలకు బలమైన గాయం అయ్యింది. చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. తుని పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుల అరెస్టు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నాలుగేళ్లగా పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. 2021లో వేర్వేరు చోట్ల పోలీసులు 27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో నిందితులు విజయవాడకు చెందిన గుడిమెట్ల రాజ్‌కుమార్ అలియాస్ చిన్ను, గుమ్మిడి సందీప్‌లతో పాటు తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన బత్తుల చంద్రశేఖర్ అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. కాగా ఈ ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసి విశాఖపట్నం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వీరికి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాండవ వంతెనపై సోమవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలను తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు అందజేశారు. సోమవారం మధ్యాహ్నం నాగరాజుపేట రైల్వే గేటు వద్ద తాండవ వంతెనపై నడుచుకుంటూ వెళుతున్న ఒక వ్యక్తిని విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న రైలు ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి సుమారు 45 ఏళ్లు వుంటాయని, నలుపురంగు జీన్స్ ప్యాంటు ధరించి వున్నాడని, ఎడమ కన్ను లేదని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు.

ఓవర్ లోడుతో వెళుతున్న వాహనాల తనిఖీ


చెక్‌పోస్టు వద్ద లారీల వే బిల్లులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

మాకవరపాలెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఆదేశాల మేరకు వెంకన్నపాలెం వద్ద ఓవర్ లోడుతో వెళుతున్న వాహనాలు తనిఖీ చేసేందుకు తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. సోమవారం బాక్సైట్ ముడి సరుకు తీసుకువస్తున్న లారీలను ఆర్‌డీవో వి.వి.రమణ, సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ డీవో మాట్లాడుతూ తాళ్లపాలెం వద్ద ఉన్న వంతెన ప్రమాదంలో ఉండడంతో ఓవర్‌లోడు వాహనాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. పయనీర్ కంపెనీకి గంగవరం పోర్టు నుంచి ముడిసరుకును అధిక లోడుతో తీసుకురావడంతో తాళ్లపాలెం వంతెన ప్రమాదంలో ఉంద న్నారు. ఇప్పటికే ఈ వంతెనను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎమ్మె ల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారన్నారు. ఈ నేపథ్యంలోనే చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఓవర్ లోడు లారీల బిల్లును తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఆర్‌టీవో, పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. అయితే వెంకన్నపాలెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుతో రోలుగుంట నల్లరాయి లారీలు బొడ్డేపల్లి నుంచి అడ్డురోడ్ మీదుగా రాంబిల్లి వెళుతున్నాయి.

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

... 5వ పేజీ తరువాయి

వెలువడిందో శాస్త్రవేత్తలు పసిగట్టేస్తారు. కేసు తీవ్రతరమవుతుంది. అందుకని పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు ఎవరి స్థాయిలో వారు సహకరిస్తున్నారు.

ఇవన్నీ లోపాలే

- ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం ఇవ్వలేదు.
- ఏ ఉత్పత్తి తయారీలో, ఎక్కడ ప్రమాదం జరిగిందో వెల్లడించలేదు.
- సిబ్బందికి పీపీఈ కిట్లు ఇవ్వకుండా సాధారణ మాస్కులే ఇచ్చారు.
- విష వాయువులు లీకైతే గుర్తించే సిస్టమ్ లేదు.
- ఉత్పత్తికి సంబంధించి ఏ ప్రమాదాలు జరుగుతాయి? వాటిని ఎలా నిరోధించాలి? అనే హజార్డస్ ప్లాన్ ఉండాలి. అది కూడా లేదు. దానిపై సిబ్బందికి అవగాహన కల్పించలేదు.
- ఘటన జరిగిన 18 గంటల తరువాత కూడా ఏ వాయువు, ఎక్కడ లీకైందో గుర్తించలేదు.

కలెక్టరేట్ ఎదుట మూగ మహిళ ఆత్మహత్యాయత్నం

... 5వ పేజీ తరువాయి

ప్రేరేపిస్తున్నారని, వారిపైనా కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ఎస్ఐ కేసు నమోదు చేయలేదు. దీంతో గత నెల 28వ తేదీన కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ మునగపాక పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. బాటిల్‌లో పెట్రోల్ తీసుకువచ్చి, శరీరంపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమయంలో అక్కడ వున్న అనకాపల్లిరూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్‌లు అడ్డుకొన్నారు. విషయం తెలుసుకుని కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ స్పందించి ఆమెకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


సంతోషమ్మతోపాటు పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474